


సబ్సిడీపై సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి షెడ్యూల్డు కులాల సహకార ఆర్థిక సంస్థ (ఎన్ఎస్కెఎఫ్‌డిసి) ఆదేశాల మేరకు మన్యం జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు (ఏ కులమువారైనా సరే) 3 సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను సబ్సిడీపై మంజూరు చేయనున్నట్టు షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 10లోగా దరఖాస్తును కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డు కులలాల సేవా సహకార సంస్థ, డాక్టర్ మర్రిచెన్నారెడ్డి భవనం, కంటోన్మెంట్, విజయనగరం అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9030014742, 9642460838, 9652600967 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

చరిత్రను సాహిత్యంగా మలిచిన గురజాడ

ప్రముఖ సాహితీవేత్త పాదిలాపు శ్రీనివాస్

ప్రజాశక్తి - పార్వతీపురం

గురజాడ లేని సాహిత్య జాడ లేదని ప్రముఖ సాహితీవేత్త పొదిలాపు శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్‌కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవం మంగళవారానికి ఎనిమిదవ రోజుకు చేరిన సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వంగపండు భూషణం గణేష్ పాత్ర సాహిత్య సాంస్కృతిక వేదికకు రచయిత పిల్ల తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి సిరికి స్వామినాయుడు రచించిన శతక పుస్తక సాహిత్యాన్ని మరో సాహితీవేత్త అల్తి మోహన్ పరిచయాన్ని అందించారు. అనంతరం పొదిలాపు శ్రీనివాస్ మాట్లాడుతూ పురాతన కాలం నుంచి, బడుగు బలహీన వర్గాల ప్రజలను అగ్రకులస్తులు అనేక రూపాల్లో దోపిడీ చేస్తూనే ఉన్నారని వివరిస్తూ సాహిత్యంతో ప్రపంచాన్ని గురజాడ చాటి చెప్పారని అన్నారు. కన్యాశుల్కం రచనతో మహిళల ఔన్నత్యాన్ని ప్రపంచానికి వెలుగెత్తి చాటిన మహా మేధావి గురజాడని, దానివల్లే మహిళలకు ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. బ్రిటీష్ కాలంలో గానీ నేడు కార్పొరేట్ కాలంలో గానీ ప్రభుత్వ సంస్థలు చేస్తున్న సహాయ సహకారాలను చాలా వ్యంగ్యంగా సాహిత్యంలో పొందుపరిచారని గుర్తు చేశారు. అనేక సంప్రదాయాలను, గిరిజన పేద ప్రజల హక్కులను కనుమరుగు చేసేలా ప్రభుత్వాలు కుట్రలు పన్నుతుంటే, అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా సాహిత్య సంపుటలను ప్రజలకు చేయడంలో కీలక పాత్ర సూత్రధారి గురజాడని అభివర్ణించారు. ముందు తరాలకు గురజాడ ఆశయాలను తీసుకుని వెళ్లడమే నేటి ఈ వేదిక నిదర్శనమని పేర్కొన్నారు.



సభలో మాట్లాడుతున్న సాహితీవేత్త శ్రీనివాస్



విద్యార్థులు ప్రదర్శిస్తున్న నృత్యరూపకం

అలరించిన నృత్య ప్రదర్శనలు

పట్టణంలోని కావ్య శ్రీ సంగీత పాఠశాలకు చెందిన చిన్నారు ప్రదర్శించిన సామూహిక నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. నాగవైశాఖి అనే బాలిక చేసిన భరతనాట్యం ఆహూతులను ఎంతగానో అలరించింది. పాఠశాల ఉపాధ్యాయులు శ్రావణి శ్రీనివాస్ మాట్లాడుతూ మన్యం పుస్తక మహెూత్సవంలో పాఠశాల విద్యార్థులతో నృత్య ప్రదర్శన చేయించడం చాలా సంతోషంగా వుందన్నారు. క్లాసికల్ డాన్స్ తమ ప్రత్యేకతని చెప్పారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయండి : జెసి

ప్రజాశక్తి - భామిని

ఈనెల 5న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎపి మోడల్ స్కూల్ సమావేశ మందిరంలో సిఎం జిల్లా పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు డాక్టర్ ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్ నిర్వహించనున్నారని, ఎటువంటి అవసరం ఉన్నా వారిని సంప్రదించాలని సూచించారు. ఈనెల 5న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరుగనుందని, ఈ కార్యక్రమానికి సంబంధించి ముఖ్యమంత్రి భామిని మండలంలో పాల్గొననున్నారని తెలిపారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైందని చెప్పారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు భామిని ఎపి మోడల్ స్కూలుకు చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇక్కడ జరిగే మెగా పేరెంట్ - టీచర్స్ మీటింగ్ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారని అన్నారు. సిఎం పాల్గొనే అన్ని కార్యక్రమాలకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పాటించేలా సంబంధితాధికారులు చేపట్టాలని ఆదేశించారు. సిఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలనన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలనిఅధికారులను ఆదేశించారు. భద్రతా, పార్కింగ్ అంశాలలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధానంగా విద్యుత్, రహదారులు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, ఏర్పాట్లతో పాటు పోలీసు, ఫైర్, ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ను కూడా అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. హెలిప్యాడ్, రచ్చబండ వద్ద ఇంటర్నెట్ సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని డిపిఒను ఆదేశించారు, సభాస్థలిలో పబ్లిక్ అడ్రస్ సిస్టం, డిజిటల్ స్క్రీన్స్, లైవ్ ఇంటర్నెట్ ఏర్పాట్లకు, అలాగే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కవరేజ్‌కి సంబంధించి జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిని ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు సుధారాణి, కె.రామచంద్రరావు, పోలీసు, ఫైర్, విద్యుత్, ఆర్ అండ్ బి, పిఆర్ వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఏకగ్రీవంగా ఎపి ఎన్‌జిఒ ఎన్నికలు

ప్రజాశక్తి - పాలకొండ

ఎపి ఎన్జీఒ, గెజిటెడ్ , నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం డివిజన్ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవమైంది. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎన్నికల అధికారులు వైవి సత్యనారాయణ, సహాయ ఎన్నికల అధికారి విజయ్‌కుమార్ దగ్గరుండి ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అన్నింటికీ ఒక్కొక్క నామినేషన్ నమోదు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షులుగా పైల ఈశ్వరరావు, సహాధ్యక్షులుగా సీతంపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెడెంట్ బి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా జె.రమేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా జె.నాయుడు, పి.జగదీష్, ఎం.లక్ష్మునాయుడు, కె.చిన్నారావు, మిస్సమ్మ, సంయుక్త కార్యదర్శులు డి.బాపినాయుడు, వి.ప్రశాంత్, జై కృష్ణ, హరగోపాల్, ఎస్.హరిణి, కోశాధికారిగా శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమ నాయుడు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పోరాటానికి ముందుండేది ఎన్జీవో సంఘమేనన్నారు. గత ఐదేళ్లగా పాలకులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నో సంఘాలు వచ్చినప్పటికీ ఎన్జీవో సంఘమే కీలకమౌతుందన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్య జిల్లాల అధ్యక్షులు హనుమంతు సాయిరాం, కిషోర్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి రంగాచారి ఎస్‌టిఒ భాస్కరరావు, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.జానకిరామ్ తదితరులున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడును, డివిజన్ నాయకులు లిల్లీ పుష్ప నాదంను ఘనంగా సన్మానించారు.

7న నవోదయ మెగా మోడల్ టెస్ట్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు మెగా మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు శ్రీ తిరుమల సాయి హైస్కూల్ కరస్పాండెంట్ రౌతు సరళకుమారి తెలిపారు. జియ్యమ్మవలస మండలం మేరంగి సెంటర్ సమీపంలో గల శ్రీ తిరుమల సాయి హైస్కూల్‌లో ఈనెల 7న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు మెగా మోడల్ టెస్ట్ నిర్వహించన్నుట్టు తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రత్యేక పరీక్ష జరుగుతుందన్నారు. నవోదయ మోడల్ టెస్ట్‌కు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష జరుగుతుందన్నారు. నవోదయ మోడల్ టెస్ట్‌లో జనరల్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన టాప్ త్రీ విద్యార్థులకు మొదటి బహుమతి రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.2వేలు, తృతీయ బహుమతి వెయ్యి నగదు ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే జనరల్ విభాగంలో ఐదుగురు విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి హాజరైన ఐదుగురు, ప్రైవేటు పాఠశాలల నుంచి హాజరైన ఐదుగురేసి విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. మోడల్ టెస్ట్‌కు హాజరు కావాల్సిన విద్యార్థులు 9989273672, 9866 118298 సంప్రదించాల్సిందిగా కోరారు.

డోలీ ఘటనపై డిఎంహెచ్ఒ ప్రకటనతో

గిరిజనుల్లో ఆగ్రహం

- నీలకంఠాపురం పిహెచ్‌సిలో అరకొర సేవలు
- మలేరియా పరీక్షలు తప్ప ఇతర పరీక్షలు లేవని ఆరోపణ
- గిరిజన ప్రాణాలకు రక్షణ కరువు
- ప్రైవేట్ ఆస్పత్రులపై ఆధారపడుతున్న గిరిజనులు


ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని తోలుంగూడ గిరిజన గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న డోలీ ఘటనపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు చేసిన ప్రకటన గిరిజనుల్లో తీవ్ర ఆందోళన, ఆగ్రహానికి దారితీసింది. ఇటీవల 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'డోలి కట్టి నాలుగు కిలోమీటర్లు మోసుకెళ్లి రోగిని రక్షించిన గిరిజనులు" అన్న వార్తకు డిఎంహెచ్ఒకు ప్రస్తావించిన తీరుపట్ల మాజీ ఎంపిటిసి సభ్యులు ఎం.అడ్డమేశ్వరరావు, గ్రామస్తులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ నీలకంఠాపురం పిహెచ్‌సిలో కేవలం మలేరియా పరీక్షలు తప్ప ఇంకా ఎటువంటి ఇతర పరీక్షల్లేవని, దీంతో గిరిజనుల ప్రాణాలకు రక్షణ కరువై తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నామని తెలిపారు. దీనిపై డిఎంహెచ్ఒ సమగ్ర విచారణ చేయకుండా వైద్య సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రోడ్డు సమస్య కోసం ఇలా చేశారనడం హాస్యాస్పదమన్నారు. మా గ్రామాలకు కనీసం రహదారి సౌకర్యం కూడా సక్రమంగా లేదు. అత్యవసర సమయంలో డోలీ మోయడం తప్ప మాకు మరో మార్గం లేదేన్నారు. అసలు ఈ డోలీ వ్యవస్థను తొలగించాలంటే ముందుగా రోడ్డు సౌకర్యం, తర్వాత ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు ఉండాలని అన్నారు. కానీ అధికారులు ఈ రెండు అంశాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విచారణ లేకుండా ప్రకటన ఇవ్వడం అన్యాయం

మా గ్రామాలకు రోడ్లు లేకపోవడంతో ఇప్పటికీ డోలీ ఎక్కించుకొని గంటల తరబడి ప్రయాణించాల్సి వస్తోంది. ఇది మా బాధ. కానీ ఈ బాధపై వెలుగుచేసిన పత్రిక వార్తను ఖండిస్తూ, ఏ విచారణా చేయకుండా ప్రకటన ఇవ్వడం సరైంది కాదు. వాస్తవం ఏమిటో గ్రామస్థాయికి వచ్చి తెలుసుకోవాలి గానీ, పిహెచ్‌సి సిబ్బంది ఇచ్చిన సమాచారం ఆధారంగా వ్యాఖ్యానించడం మాకెంతో బాధ కలిగించింది" అని తెలిపారు.

గ్రామస్థాయిలో సమగ్ర విచారణ జరపాలి




మాట్లాడుతున్న తోలుంగూడ గిరిజనులు

ఈ సంఘటనపై జిల్లా అధికారులు గ్రామానికి వచ్చి సాక్ష్యాలతో సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని గ్రామస్తులు తెలిపారు. పిహెచ్‌సి సేవలు సక్రమంగా అందుబాటులో ఉండాలని, రాత్రిపూట కూడా వైద్య సిబ్బంది ఉంటారని చెప్పే వాగ్దానాలు అమలు కావాలని వారు కోరారు. తాము అనుభవించిన కష్టాలను తిరస్కరించడం ఎవరికీ హక్కు లేదని, తమ మాట విని విచారణ చేస్తే వాస్తవం బయటపడుతుందని గిరిజనులు స్పష్టం చేశారు.

డిసిసి అధ్యక్షుడి రేసులో రామకృష్ణ

మన్యం జిల్లా నాయకత్వానికి ఆరుగురు పోటీ

ప్రజాశక్తి - పార్వతీపురం



జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి రేసులో సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ ఉన్నారు. ఈ మేరకు ఆయన ఎఐసిసి పరిశీలకుడు దేబాసిస్ పట్నాయక్‌కి తన బయోడేటాను అందజేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్‌తో సహా పిసిసి నాయకులు నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమన్వయకర్త గేదెల రామకృష్ణ డిసిసి అధ్యక్ష పదవి కోసం తన ఆసక్తిని వ్యక్తపరిచారు. ఆయనతోపాటు పాలకొండ నియోజకవర్గ సమన్వయకర్త బత్తిన మోహనరావు, మరికొందరు నాయకులు కూడా రేసులో వున్నట్లు తెలుస్తోంది.అయితే మన్యం జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రామకృష్ణనే ఎంపిక చేస్తారనే ప్రచారం జరుగుతోంది. విద్యావంతుడు, నిజమైన గిరిజన నాయకుడైన రామకృష్ణకు జిల్లాలోని గిరిజన తెగలతో సత్సంబంధాలు ఉన్నాయి. అంతేకాకుండా ఆయన జిల్లా సహకార శాఖ లో డివిజినల్ అధికారిగా పని చేసి ఉద్యోగవిరమణ చేశారు. అధికారిగా పని చేసిన కాలంలో ఆయనకు అన్ని వర్గాలతో సత్సంబంధాలు నెరిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ సాలూరు నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేయాలని భావించారు. అయితే అధిష్టానం ఇంకో నాయకుడిని అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన పోటీ నుంచి విరమించుకున్నారు. రామకృష్ణ పార్వతీపురం మండలానికి చెందిన నాయకుడు కావడం, ఆయన కుటుంబ అవసరాల రీత్యా జిల్లా కేంద్రంలోనే నివాసం ఉండడం ఆయనకు అనుకూల అంశాలుగా ఉన్నాయి. రాష్ట్ర నాయకత్వం కూడా ఆయన వైపే మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంపై వివరణ కోరగా డిసిసి అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేశానని, అవకాశం ఇస్తే చేస్తానని గేదెల రామకృష్ణ చెప్పారు.

వ్యాధి లక్షణాలు గుర్తించేందుకు సర్వేలు : డిఎంహెచ్

ప్రజాశక్తి - భామిని

ఆరోగ్య సర్వేలు పారదర్శకంగా నిర్వహించి వ్యాధి లక్షణాలు స్పష్టంగా గుర్తించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. స్థానిక పిహెచ్‌సిని ప్రోగ్రాం అధికారులతో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో సేవలపై ఆరా తీసి మందులు, వైద్య పరీక్షల లభ్యతపై తెలుసుకున్నారు. అనంతరం ఆశాడే కార్యక్రమంలో పాల్గొని గ్రామీణ వైద్య సేవలపై సమీక్షించారు. మాతా, శిశు ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. తల్లిపాలు ఆవశ్యకతపై అవగాహన పెంపొందించాలని, అలాగే పిల్లల వయసు పెరిగే కొద్దీ పోషకాలు అవసరమవుతాయని, అందుకు కాంప్లిమెంటరీ ఫీడింగ్‌పై తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. పిహెచ్‌సిల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా కార్యాచరణ చేయాలన్నారు. ఆర్‌బిఎస్‌కె, ఎన్‌సిడి, టిబి, లెప్రసీ, శాన్స్, ఫీవర్ సర్వేలు పక్కాగా నిర్వహించి సకాలంలో వ్యాధులను గుర్తించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సమస్యలను సత్వరమే తెలియజేయడంలో ఆశాలు కీలకమన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందజేయడంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయపార్వతి, జిల్లా ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సూర్యకౌశిక్, డిఎంఒ సత్యనారాయణ, వైద్యాధికారులు సంతోషిలక్ష్మి, భార్గవ నాయుడు, సబ్ యూనిట్ అధికారి తిరుపతిరావు, సూపర్వైజర్ గౌరీశ్వరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ప్రచార కార్యక్రమంలో సిఐటియు నాయకులు



పాలకొండలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - సాలూరు

కేంద్రంలో, రాష్ట్రంలో కార్మిక హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలపైనా, కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి, పోరాటాలు నిర్వహించేందుకు వెనుకాడబోమని సిఐటియు హెచ్చరించింది. అఖిలభారత సిఐటియు మహాసభల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బాగువలస, తోణాం, మామిడిపల్లిలో ప్రచార కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు వై.గౌరీశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీవాసరావు మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కార్మికులపై కక్ష కట్టిన లేబర్ కోడ్లు రద్దు చేయాలని, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి ప్రకటించి, ఉద్యోగులు, కార్మికులకు పెరిగిన ధరలకు తగినంతగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లలో రిటైర్ అవుతున్న వారికి సగం జీతం పెన్షన్‌గా ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబాలకు లేదా, రిటైర్ అయిన వారి కుటుంబ సభ్యులకు ప్రాధాన్యతగా ఉద్యోగానికి అవకాశం కల్పించాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పై సమస్యలపై ఈనెల 31, జనవరి 1, 2, 3 న విశాఖపట్నంలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభల్లో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణకు కార్మిక వర్గాన్ని సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కీం వర్కర్ల యూనియన్ నాయకులు భారతి, సునీత, మరియమ్మ, త్రివేణి, ఆదిలక్ష్మి, రవణమ్మ, రాధ, సుహాసిని, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సీతానగరం : మండలంలోని పెదంకలాం పిహెచ్‌సి పరిధిలో గల ఆశా కార్యకర్తల సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ విశాఖలో సిఐటియు అఖిలభారత మహాసభలు ఈనెల 31 నుండి జనవరి 4 వరకు జరుగుతాయని, ఈ సందర్భంగా విశాఖలో జనవరి 4న జరిగే బహిరంగ సభకు కార్మికులంతా చలో విశాఖ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు చందాన అన్నపూర్ణ, కోట రమాదేవి, కిల్లాడ ప్రమీల, బడే రాధ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి వి రమణ పిలుపునిచ్చారు. గరుగుబిల్లిలో వివిధ కార్మిక సంఘాల కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభలు ఈనెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతున్నాయని, ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక విధానాలపై భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కావున ఈ మహాసభల్లో కార్మికవర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభలకు సంబంధించిన ప్రచార గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు దాసరి వెంకటనాయుడు, సామంతుల అప్పడు, పుచ్చల గోపాల్, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో 5 రోజుల పాటు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. జనవరి 4న విశాఖపట్నం ఆర్.కె.బీచ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభలో యావన్మంది కార్మిక వర్గం పాల్గొవాలని కోరారు. మండలంలోని చెక్ పోస్ట్ సెంటర్, ఆటో స్టాండ్ వద్ద సిఐటియు అఖిల భారత మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, బి ప్రసాద్, ఎం.రాము, ఆర్.హరి, పి.జయరాము, ఎ.అశోక్, టి.లక్ష్మీనారాయణ, బి.రమేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖలో జరుగుతున్న నేపథ్యంలో వాటిని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా పిలుపునిచ్చారు. మంగళవారం కొమరాడ, మాదలింగి, రామభద్రపురం పిహెచ్‌సిల వద్ద మహాసభలకు సంబంధించిన గోడపత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి, యల్లమ్మ, గంగమ్మ, సుమలత, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ నాయకులు రాజేశ్వరి, పార్వతి, ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

మక్కువ : అఖిలభారత మహాసభల ప్రచార కార్యక్రమంలో భాగంగా మక్కువ, శంబరలో ప్రచార కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జి.కృష్ణరావు, అలజంగి భాస్కరరావు, కృష్ణవేణి, సీత, రేవతి పాల్గొని మాట్లాడారు. ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభలో కార్మిక వర్గమంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్కీం వర్కర్ల పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పాచిపెంట : ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, శ్రామిక మహిళా సంఘం నాయకులు గంట జ్యోతిలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.నిర్మల, మంజుల, చండీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.పార్వతీదేవి, కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అఖిలభారత సిఐటియు మహాసభలు విజయవంతం చేయాలని, విశాఖపట్నం తరలి రావాలని పిలుపునిచ్చారు. అధిక సంఖ్యలో ఆశా వర్కర్ల కమిటీలు పాల్గొన్నారు. అలాగే గురువునాయుడుపేట పిహెచ్‌సి వద్ద కూడా ఈ కార్యక్రమం జరిగింది.



సాలూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, ఆశాలు



వీరఘట్టం రోడ్‌లో ఉన్న పుట్టగొడుగుల శిక్షణ కేంద్రం

పని కల్పిస్తా... లక్షల్లో డిపాజిట్లు ఇవ్వండి

పుట్టగొడుగుల శిక్షణ పేరిట నిరుద్యోగులకు ఎర

ప్రజాశక్తి పాలకొండ

నిరుద్యోగులకు ఎరా వేసేందుకు కొంతమంది పన్నాగం పన్నుతున్నారు. ఇదే కోవలో పాలకొండలోని వీరఘట్టం రోడ్‌లో పుట్టగొడుగుల కేంద్రం పేరుతో నిరుద్యోగులకు ఎరవేసి లక్షల రూపాయలు కాజేసినట్లు చర్చ జరుగుతోంది. ఉద్యోగాలిస్తామంటూ లక్షల రూపాయలు డిపాజిట్లు పేరుతో వసూలు చేసినట్లు తెలుస్తుంది. పుట్టగొడుగులు కేంద్రంలో శిక్షణ ఇస్తామని, పురుషులు లక్ష రూపాయలు, మహిళలు రూ.50 వేలు డిపాజిట్లు చెల్లించాలంటూ నిర్వాహకులు చెప్పి సుమారు కోటి రూపాయల వరకు డిపాజిట్ల పేరుతో వసూలు చేసినట్లు తెలుస్తుంది. అయితే దీనిపై పలుఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పుట్టగొడుగులకు మార్కెట్లో అంత గిరాకీ లేనప్పటికీ ఏ విధంగా ప్రతినెలా జీతాలు చెల్లిస్తారంటూ అందరిలోనూ చర్చ జరుగుతుంది.

డిపాజిట్లు సేకరించడం చట్ట వ్యతిరేకం

రిజర్వు బ్యాంకు ఆమోదం లేకుండా ఇలాంటి సంస్థలు డిపాజిట్లు సేకరించరాదు. నిరుద్యోగులను మభ్యపెట్టి లక్షల రూపాయలు వారి నుంచి వసూలు చేయడం పట్ల ప్రజలను సర్వత్రారోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారంలో కొంతమంది అధికారులు కూడా కాసులు కక్కుర్తి పడినట్లు తెలుస్తుంది. దీనిపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది

చట్టవిరుద్ధమైన చర్యలు : సిఐ ప్రసాదరావు

ఉద్యోగుల పేరుతో డిపాజిట్లు సేకరించడం చట్ట విరుద్ధమైన చర్య. ఆర్‌బిఐ అనుమతి లేకుండా ఎవరూ డిపాజిట్లు సేకరించకూడదు. ఇలాంటి సంస్థలపై కేసు పెడతాం. ఈ విషయం తన దృష్టిలో కూడా ఉంది. ఎవరికీ డబ్బులు ఇచ్చారనేది కూడా దర్యాప్తు చేస్తాం.



కొత్తవలస రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని రెల్ల నుండి తంగసన్నగూడ మీదుగా కొత్తవలస వరకు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో రూ.145 లక్షల ఖర్చుతో నిర్మించిన బిటి రోడ్డును మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారి నిర్మాణం వల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. దీంతో ప్రజలు అన్ని రకాల అభివృద్ధికి ఆస్కారముంటుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణ్ రావు, నోడ్రుకోన, దుమ్మంగి సర్పంచులు పత్తిక మునస్వామి, పాలక క్రాంతి కుమార్, మాజీ ఎంపిపి తాడంగి లక్ష్మణరావు, మండల టిడిపి మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, మాజీ సమితి అధ్యక్షులు వెంపటాపు భారతి, నాయకులు రామారావు, వెంకట్రావు, దామోదర్ రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్

మెగా పిటిఎంను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల 5న పాఠశాలలలో జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ డే మీటింగ్‌ను విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని గుమడ మండల ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ముందుగా పాఠశాలలో చదువుతున్న పిల్లల రోల్స్ పరిశీలించి 1,3,5వ తరగతుల విద్యార్థుల విద్యాభివృద్ధిపై అడిగి తెలుసుకున్నారు. ఈనెల 5న జరగబోయే మెగా పేరెంట్స్ డే సందర్భంగా నిర్వహించబోయే సాంస్కృతిక కార్యక్రమాన్ని ముందుగా పరిశీలించి, వీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనం శాల, స్కూల్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందజేశారు. మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైనట్లు గుర్తించినందున, వెంటనే మెకానిక్‌ను సంప్రదించి బాగుచేయాలని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్, వెల్ఫేర్ సెక్రటరీ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

'స్వచ్ఛ మక్కువ'ధ్యేయంగా పనిచేయాలి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించి స్వచ్ఛమక్కువ నెలకొల్పడంలో వర్తకులంతా ముందుకు రావాలని ఎంపిడిఒ ఎం.అర్జునరావు సూచించారు. స్థానిక సచివాలయంలో మేజర్ పంచాయతీలోని వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ విక్రయాలను తగ్గించి గోనె సంచులు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఇఒ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

రానున్న పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఇఒ-1 ఎస్.సింహాచలం తెలిపారు. మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన ఎస్ఎ- 1 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ప్రగతిని సమీక్షించారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఈనెల 6నుంచి వందరోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ హెచ్ఎం బి.వెంకటరమణ, స్టాఫ్ సెక్రటరీ నారాయణస్వామి, శ్యాం, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిదిమిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమిలో మంగళవారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమోహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో హైరిస్కు గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్, ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తరచుగా గ్రామాలను సందర్శించి గర్భిణులు గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారమందేలా చూడాలన్నారు. ప్రతి నెలా 9న ఆరోగ్య కేంద్రంలో నిర్వహించి వైద్య తనిఖీలకు గర్భిణులను తీసుకురావాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనానికి సమాచారం అందించాలన్నారు. సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతి కుమారి, సుభారతామని, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

భవనిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం కార్యదర్శి తోలాపు రమేష్ కోరారు. మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పనుల్లేక ప్రత్యామ్నాయంగా భవన నిర్మాణ రంగంలో పనులు దొరుకుతాయని ఈ రంగాన్ని ఎంచుకున్నామని తెలిపారు. గృహ నిర్మాణానికి అవసరమయ్యే ఐరన్, సిమెంటు, ఇటుక, ఇసుక మెటీరియల్ ధరలు అమాంతంగా పెరగడంతో పాటు కార్మికుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల పనుల్లేవన్నారు.భవన కార్మికుల సంక్షేమ నిధిలో రూ.12వేల కోట్లు పన్నుల రూపంలో వచ్చిన డబ్బులు ఉన్నాయని, కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన ఈ డబ్బులను ఇతర పథకాలకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ఏడాదిగా పనుల్లేక ఇబ్బంది పడుతున్న కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 4న విశాఖలో జరుగు సిఐటియు అఖిలభారత మహాసభలను కార్మికులందరు పాల్గొనిజయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు ఆర్.రాము, నాయకులు ఆర్.శంకరరావు. బి.లక్ష్మ నాయుడు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు తప్పకుండా ఉంటుందని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలూ అంకితభావంతో, పట్టుదలతో పనిచేసిన కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన సాలూరు నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి వార్డు, పంచాయతీలో పసుపు జెండా ఎగురవేయాలని, నూటికి నూరు శాతం కూటమి విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని కిందిస్థాయిలో అమలయ్యేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని, అప్పుడే ప్రతి ఒక్కరికీ గుర్తింపు, గౌరవం కలుగుతాయని ఆమె తెలిపారు. ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రతినెలా ఒకటో తేదీన స్థానిక ఉద్యోగులతో కలిసి పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయో లేదో తెలుసుకుని, అందని వారి తరపున స్థానిక సచివాలయం వద్ద లేదా పార్టీ పెద్దలకు తెలియజేసి, వారికి పథకాలు అందేలా చూడాలని కోరారు. పార్టీ అధ్యక్షులతో కలిసి క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మై టిడిపి యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి వైద్య సదుపాయం ఉండాలని, ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా వారికి దగ్గరలోనే వైద్యం అందేలా ప్రభుత్వం సుమారు రూ.20 కోట్లతో 40 ఆరోగ్య సబ్ సెంటర్లను మంజూరు చేసిందని ఆమె ప్రకటించారు. ఈ నెల 5న జరిగే మెగా పేరెంట్-టీచర్ మీటింగ్స్‌కు తమ తమ గ్రామాల్లో, పాఠశాలల్లో తప్పనిసరిగా హాజరై, వాటిని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ, మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గూడెపు యుగంధర్, చలుమూరు వెంకట్రావు, గుళ్ల వేణుగోపాలరావు, క్లస్టర్ యూనిట్ ఇన్చార్జులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎం సహాయ నిధి

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల ఆరోగ్య సమస్యల సమయంలో అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం సాలూరులో గల క్యాంప్ కార్యాలయంలో 8మంది లబ్ధిదారులకు రూ.6,23,950 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు ఈ సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులంతా సిఎంకు, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పాలకొండ

భామిని మండలంలో ఈనెల 5న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఈనెల 4న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, 5న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన భామిని మండలం ఉందన్నారు. కావున పార్టీ శ్రేణులంతా విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గ సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. తోటపల్లి ఎడమ కాలువ పనులు ఆధునీకరంతో పాటు జంపర్ కోట సమస్యల్ని సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. విలేకరుల సమావేశంలో తిరిగి యువత అరకు పార్లమెంటు పార్టీ అధ్యక్షులు వారాడ సుమంత్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, జయశంకర్, శివానంద్, గుమ్మడి సింహాద్రి, శ్వాసకు సర్వర్ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - సీతానగరం

ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ తెలిపారు. మండలంలోని కోట సీతారాంపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు అధిక దిగుబడులు వస్తాయన్నారు. సొంత విత్తనాలు అధిక దిగుబడులు వస్తాయన్నారు. ద్రవ, ఘనజీవామృతాల వినియోగంతోనే భూమి సారవంతం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం అనుసరించడం ద్వారా రైతులకు ఖర్చు తక్కువ లాభాలు పొందుతారన్నారు. కార్యక్రమంలో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు



పీడీకి వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీ, సిఐటియు నాయకులు

వేతనాలు పెంచాలని పీడీకి వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సిఐటియు ఆధ్వర్యాన ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారికి మంగళవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి, శ్రామిక మహిళ నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ గర్భిణులకు, పిల్లలకు, బాలింతలకు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీలు అనేక సేవలు అందిస్తున్నారని, 2019 నుంచి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదని, 2023లో అంగన్వాడీల సార్వత్రిక సమ్మె 42 రోజులు చేశారని, 2024 జూలైలో అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని సమస్యలు పరిష్కారం చేస్తామని మినిట్స్ ఇచ్చారు కానీ అమలు చేయలేదని పేర్కొన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చారని, ఇంకా 1810మంది మినీ వర్కర్లు మెయిన్ వర్కర్లుగా మారలేదని తెలిపారు. పదో తరగతి పాసైన మినీలను కూడా అప్‌గ్రేడ్ చేయలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నిబంధనలు రూపొందించలేదని, సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని, హెల్పర్ ప్రమోషన్లు రాజకీయం జోక్యం వల్ల అర్హులకు ప్రమోషన్లు ఇవ్వడం లేదని, సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోవడం వల్ల ఫేస్ యాప్ ఆన్లైన్ వర్కులు చేయడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీ స్కూల్ పిల్లలకు సాయంత్రం పూట ఇస్తున్న స్నాక్స్ ఆపేశారన్నారు. కావున ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 12న కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తామని పిడికి తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ, పార్వతీపురం ప్రాజెక్ట్ అధ్యక్షులు గౌరీమణి, సిపిఎం పట్టణ కమిటీ నాయకులు రాజేశ్వరి, బంకురు సూరిబాబు, పాల్గొన్నారు.



సాలూరు : మామిడిపల్లిలో మానవహారం చేస్తున్న విద్యార్థులు

డ్రగ్స్ వద్దు.. చదువే ముద్దు


ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు నిరోధానికి చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సైకిల్ యాత్ర జరిగింది. మండలంలోని శంబర పోలమాంబ వనం గుడి నుంచి మక్కువ వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్లు సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి, సిఆర్పిఎఫ్ ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాలు వినియోగంతో జీవితం నాశనం చేసుకోవద్దని, అంతా వాటికి దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అభ్యుదయ సైకిల్ యాత్రకు మక్కువలో ఘనస్వాగతం లభించింది. స్థానిక సువర్ణముఖి నది వంతెన నుంచి మేళతాళాలు, కోలాటాలతో ఊరేగింపుగా యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

సాలూరు : విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంపిడిఒ జి.పార్వతి పిలుపునిచ్చారు. మండలంలోని మామిడిపల్లిలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో మామిడిపల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శివకుమార్, సర్పంచ్ శశికళ, నాయకులు బూస తౌడు, తిరుపతిరావు, సువ్వాడ రామకృష్ణ, పెద్దింటి మాధవరావు, నరసింహరాజు, విద్యార్థులు గ్రామస్తులు యువత పాల్గొన్నారు.

పల్స్ పోలియో ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



శిక్షణలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ఈ నెల 21న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై రీ ఓరియంటేషన్ శిక్షణను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఎన్జీఓ హోంలో వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్వేలెన్స్ వైద్యాధికారి డాక్టర్ జాన్ పవర్ ప్రజంటేషన్ ద్వారా పల్స్ పోలియో కార్యాచరణపై శిక్షణ అందించారు. జిల్లాలో కార్యక్రమ నిర్వహణపై డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లలను రక్షించేందుకు ఈ వ్యాక్సిన్ ఎంతో ఆవశ్యకమైందని, చిన్నారుల భవిష్యత్ ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని అన్నారు. జిల్లాలో కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు ఈ శిక్షణ సద్వినియోగం కావాలని, క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందికి శిక్షణను అందించి పల్స్ పోలియో శతశాతం పూర్తి చేయడమే లక్ష్యంగా వారిని సంసిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు పిల్లల జాబితా, కార్యాచరణ సంబంధిత మైక్రో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. హైరిస్క్ ప్రాంత నివాసితులను గుర్తించాలన్నారు. కోల్డ్ చైన్ నిర్వహణ సమర్థవంతంగా ఉండేలా ముందస్తుగా చూసుకోవాలన్నారు. ఇప్పటి నుండే ప్రజల్లో అవగాహన కల్పించి పల్స్ పోలియో ఆవశ్యకతపై తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ విజయ మోహన్, ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్ మోహనరావు, డాక్టర్ రఘుకుమార్, డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ సూర్య కౌశిక్, వైద్యాధికారులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కొమరాడ

రాజ్యలక్ష్మీపురం వద్ద గల జంఝావతి రబ్బరు డ్యామ్ వద్ద ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం కాంగ్రెస్ ఒబిసి మన్యం జిల్లా చైర్మన్ వంగలి దాలినాయుడు, నియోజకవర్గ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, ఎస్సీ సెల్ చైర్మన్ కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకరరావు తదితరులు శివినిలోని మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా జంఝావతి ప్రాజెక్టు పూర్తి చేయకపోవడమే ఇటువంటి ప్రమాదాలకు కారణమన్నారు. అదే జంఝావతి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూర్తిచేసి వుంటే రబ్బరు డ్యామ్ వద్ద గల రివర్ గ్యాప్‌ను మూసివేసి ఉండేవారన్నారు. అప్పుడు రబ్బర్ డ్యామ్ వద్ద ఇటువంటి ప్రమాదాలు జరిగి ఉండేవి కాదన్నారు. ఇది వైసిపి, టిడిపి ప్రభుత్వాల తప్పిదాలే అన్నారు. ఒకే గ్రామంలో ముగ్గురు చనిపోవడం వల్ల గ్రామమంతా ఆవేదనకు గురైందన్నారు. మతి చెందిన ముగ్గురిలో ఇద్దరు గిరిజనులు కావడంతో పార్వతీపురం ఐటిడిఎ వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. అలాగే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు, పాలకులు ప్రకటన చేసి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

అధిక దిగుబడులకు పంట మార్పిడే మార్గం

ప్రజాశక్తి - గరుగుబిల్లి



విత్తన తయారీని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించడానికి, భూమిని సారవంతం చెందడానికి, తెగుళ్ల రాకుండా ఉండడానికి, పంటల అధిక దిగుబడులు సాధించడానికి పంట మార్పిడి విధానం ఏకైక మార్గమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రబంధకులు ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు అన్నారు. మండలంలోని గిజబలో రబీ డ్రై సోయింగ్ భాగంగా మంగళవారం పంట మార్పిడి విధానంలో రబీలో మినుములతో పాటు కంది, ఆముదం, సజ్జ, జొన్న, గోరుచిక్కుడు, గోంగూర, ముల్లంగి, గోంగూర మొదలగు పంటలు రైతులు మరడాన శ్రీను, లచుపతుల ఉమా, మారడాన వెంకట నాయుడు ఈ పద్ధతిలో పంటలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ 70రోజుల్లో మినుము పంట అయిపోతుందని, మిగిలిన పంటలు వేసవిలో భూమి ఖాళీగా ఉండకుండా ఈ పంటలు భూమిని కప్పి ఉంచి పచ్చగా ఉంటాయని, వీటి ద్వారా భూమిలో ఉన్న సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందుతాయని, భూమి కూడా సారవంతం చెందడం జరుగుతుందని మొక్కల్లో జీవవైవిధ్యం పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. ఇలా వేసుకోవడం వల్ల ఏ విధమైన రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా, పెట్టుబడి లేకుండా, పంటల దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని, రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతుందన్నారు. అలాగే అరటిలోనూ అంతర్ పంటలు వేసుకోవాలని చెప్పారు. అన్ని గ్రామాల్లో పంట మార్పిడి విధానం ద్వారా ఇలా పంటలు వేయడానికి కార్యకర్తలు అందుబాటులో ఉండాలని, రైతులకు కూడా అవగాహనపర్చి ఆచరించేలా చేయాలని సూచించారు. ఇలా ప్రతి రైతు భూమిలో వరి కోసిన వారం రోజుల ముందు ఇలా వేసుకోవాలని, ప్రధాన పంటతో పాటు మిగిలిన పంటలు వల్ల అధిక ఆదాయం వస్తుందని వివరించారు. అలాగే తోటపల్లిలో 0.50సెంట్లు విస్తీర్ణంలో చుట్టూ ట్రెంచ్‌లు తీసుకుని చేపలను పెంచడం వల్ల అధిక లాభం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైపి రవితేజ, ఎన్ఎఫ్ఎ అన్నపూర్ణ, యూనిట్ ఇన్‌ఛార్జి పోలినాయుడు, వెంకటనాయుడు, ఉమాభవానీ, లలిత, అపర్ణ రైతులు పాల్గొన్నారు.

18 వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి -పార్వతిపురం టౌన్

పట్టణంలోని బెలగాంలో 18 వ వార్డులో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పర్యటించారు. వార్డులోని ప్రతి వీధిలో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీరు సరఫరా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను సూచించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రతిరోజు ఉదయం గాని, సాయంత్రం గాని అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో పర్యటించి ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు అభ్యసనపై పరిశీలన

వీరఘట్టం : పాఠశాలలో విద్యా ప్రమాణాలను అభ్యాసన పనితీరుపై ఎఫ్ ఎల్ ఎన్ అమలు తీరును మంగళవారం శ్రీకాకుళం జిల్లా వమ్మరవల్లి డైట్ సీనియర్ ఆంగ్ల లెక్చరర్ కె.శ్రీనివాస రావు పరిశీలించారు. మండలంలోని తలవరం,నీలనగరం, తెట్టంగి, పనస నందివాడ తదితర గ్రామాల పాఠశాలలను సందర్శించి. విద్యా నూతన సంస్కరణలు విధానం ఏ విధంగా విజయవంతం అవుతున్నాయో, ఉపాధ్యాయుల పనితీరు, అభివృద్ధి విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి పలు సలహాలు అందజేశారు.

పలువురిపై కుక్క దాడి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



బాలికను గాయపర్చిన కుక్క

పట్టణం లో వీధికుక్కలు పలువురిపై దాడి చేశారు. వీరిలో భవన నిర్మాణ కార్మికుడు గాయపడిన సంఘటన జరిగింది. పట్టణం లోని తెలుకుల వీధికి చెందిన తంబల లక్ష్మణరావు (64) అనే భవనిర్మాణ కార్మికుడు మంగళవారం ఉదయం భవన నిర్మాణ పనులకు వెళ్తున్న క్రమంలో కుక్క కాలుకు, చేతికి కరవడంతో గాయాల పాలయ్యాడు. దీంతో అతనిని బంధువులు చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. అలాగే పట్టణంలోని ఆడబడి వీధిలో గల పిఆర్ఎంఎం బాలికల ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని మండల భానుప్రియను కరవగా, ఇదే వీధికి చెందిన ఐదో తరగతి చదువుతున్న బేతా పార్థసారథి అనే విద్యార్థిపై కూడా కుక్కలు దాడి చేసి కరిచాయి. పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో వీటి అరుపుల కారణంగా నిద్ర పట్టని పరిస్థితి కూడా ఉంది. కొన్ని సందర్భాల్లో దాడులకు ఎగబడుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 16న కొత్తవలసలోని మణికంఠ కాలనీకి చెందిన రోహిత్ అనే బాలుడ్ని కుక్క కరవడంతో వైద్యం చేయించిన అనంతరం మరణించిన సంఘటన జరిగింది. వీటిని నియంత్రించాలని పట్టణ ప్రజలు పలుమార్లు అధికారులను కోరినా నియంత్రణపై దృష్టి పెట్టకపోవడం శోచనీయం. వీటి నియంత్రణపై జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఫ్రైడే, డ్రైడే అంటే ఇదేనా?

కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు

ప్రచారానికే పరిమితమవుతున్న అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలు చేపడుతున్నా వాటి ప్రయోజనం ఎక్కడా కనిపించడం లేదు. కేవలం ప్రచారాలకే పరిమితం అవుతున్నాయన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. మండల కేంద్రంతో పాటు, హుస్సేన్‌పురం, తలవరం, బిటివాడ, రేగులపాడు, కత్తుల కవిటి, నీలానగరం తెట్టంగి, పనస నందివాడ, నడుకూరు, దశమంతపురం, సంత నర్సిపురం, వండువ, చిదిమి, చలివేంద్రి, కంబర, కిమ్మీ, చిట్టపూడి వలస, నడిమికెళ్ల, తూడి, చిన్నగోర సచివాలయాల్లో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడంతో పాటు ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు సచివాలయాల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించారు. వీరంతా ప్రతి శుక్రవారం గ్రామాల్లోకి వెళ్లి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం మొక్కబడిగా గ్రామాలకు వచ్చి ఫోటో తీసుకొని వెళ్తున్నారు తప్ప ఎక్కడా పారిశుధ్యం మెరుగుపడే దాఖలాలు కనిపించట్లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

చెత్తాచెదారాలతో నిండిన కాలువలు

వీరఘట్టంతో పాటు, చలివేంద్రి, బొడ్లపాడు, బిటివాడ, నడుకూరు, పెద్దూరు, ఎం.రాజపురం తదితర గ్రామాల్లో అపారిశుధ్యం విలయతాండం చేస్తుంది. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లి ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు వేలాది రూపాయలు వెచ్చించి నయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సచివాలయాల ప్రత్యేక అధికారులు స్పందించి ప్రచారాలకు పరిమితం కాకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపిడిఒ బి.వెంకటరమణ వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా, గ్రామాల్లో కాలువలను పరిశీలించి, పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బొడ్లపాడులో నీటి ట్యాంకు వద్ద కాలువలో పేరుకుపోయిన చెత్త